ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
3★★
బుధవారం 26 ఫిబ్రవరి 2025



వైభవంగా శివ కల్యాణం

కొడిమ్యాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మతురావుపేట గ్రామంలోని శివాలయంలో శివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం శివ కల్యాణం పండితులు రాధక్రిష్ణశర్మ ఘనంగా నిర్వహించారు. కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై పుర ప్రముఖుల ఆద్వర్యంలో శివ కల్యాణం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కొడిమ్యాల మాజీ జడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారావు, కుటుంబ సభ్యులు, గ్రామ ప్రముఖులు శ్రీనివాస్, రాజు, రంజిత్ అయిలయ్య మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచులు కల్యాణంలో పాల్గొన్నారు.

సాగు నీరు విడుదల చేయాలి

రాయికల్, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని పెద్ద చెరువు ఎండిపోయినందున డి-521 కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని రైతులు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ గణేష్‌కు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. చెరువు ఎండిపోవ డంతో సాగుకు, తాగునీటికి సమస్య ఏర్పడే అవకాశం ఉందన్నారు. కావున సాగు, తాగునీటి కోసం పెద్ద చెరువు నింపేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు శ్రీధర్, మహేష్, గంగారెడ్డి, రాములు, సాయిరాం, గోపి, గంగాధర్, నరేందర్ పాల్గొన్నారు.

నియామకం

ఎండపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజారాంపల్లి గ్రామంలోని అక్షర కిడ్స్ పాఠశాలలో మంగళవారం విశ్వబ్రాహ్మణ సంఘం నూతన పాలక మండలిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా సీపెల్లి శంకర్, ఉపాధ్యక్షుడిగా సింహరాజు సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులుగా ఎర్రోజు వెంకటచారిలు నియామకం అయ్యారు.


రాయికల్‌లో రహదారిపై కొనసాగుతున్న మార్కెట్


మెట్‌పల్లిలో అర్ధంతరంగా నిలిచిన సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు

సమీకృత మార్కెట్ల నిర్మాణాలకు మోక్షమెప్పుడో..?

- మున్సిపాలిటీల్లో పూర్తి కాని పనులు
- నిధుల లేమి ప్రధాన కారణం
- రాయికల్‌లో స్థల సమస్య

జగిత్యాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో సమీకృత మార్కెట్ల నిర్మాణాలు పూర్తికాక ప్రజలు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వినియోగదారులకు అందుబాటులో ఉండేలా కూరగాయలు, మాంసాహారం అన్నీ ఒకేచోట విక్రయాలు జరపాలని సమీకృత మార్కెట్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. కానీ ధర్మపురి మున్సిపాలిటీలో మినహా అంతటా పనులు పడకేశాయి. రాయికల్‌లో స్థలం అందుబాటులో లేకపోవడంతో నిర్మాణం ప్రారంభం కాకపోగా, మరికొన్ని చోట్ల పునాదులకు, గోడల నిర్మాణాలకే పరిమితమయ్యాయి. నిధులు సైతం పూర్తి స్థాయిలో విడుదల కాకపోవడంతో పలు చోట్ల పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో పట్టణాల్లో కూరగాయలు, మాంసం విక్రయాలు రోడ్లపైనే జరుగుతున్నాయి. సమీకృత మార్కెట్ల నిర్మాణాలను పూర్తి చేస్తే ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది.

● జగిత్యాలలో పూర్తి కాని పనులు

జిల్లా కేంద్రమైన జగిత్యాలలో సమీకృత మార్కెట్ పనులు పూర్తి కాకపోవడంతో వినియోగదారులకు అందుబాటులోకి రావడం లేదు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో సమీకృత మార్కెట్ నిర్మాణానికి రూ.4.50కోట్ల నిధులు మంజూరు చేశారు. రెండు సంవత్సరాల క్రితం పనులు ప్రారంభించినప్పటికీ నేటికీ పూర్తి కాలేదు. సమీకృత మార్కెట్‌లో నీటి సరఫరా, విద్యుత్‌సౌకర్యం వంటి వసతులు కల్పించలేదు. ఇందుకోసం మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.35లక్షల నిధులను ఇటీవల కేటాయించారు. ప్రస్తుతం పట్టణంలోని అంగడి బజార్, శ్రీరామ థియేటర్, ధర్మపురి బస్టాండు, కొత్త బస్టాండు, టవర్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో కూరగాయల అమ్మకాలు, కొత్త బస్టాండు వద్ద చేపల అమ్మకాలు, పలు ప్రాంతాల్లో రహదారులపై మాంసం విక్రయాలు జరుగుతున్నాయి.

● స్థల సేకరణలో ఇబ్బందులు

రాయికల్ పట్టణంలో సమీకృత మార్కెట్ నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులను మంజూరు చేసింది. సమీకృత మార్కెట్ నిర్మాణానికి స్థల సేకరణ సమస్యగా మారింది. స్థలాన్ని సేకరించడంలో అటు ప్రజా ప్రతినిధులు, ఇటు అధికారులు విఫలమయ్యారు. దీంతో ఇప్పటివరకు సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. కాగా ప్రస్తుతం రాయికల్‌లోని ప్రధాన వీధిలో, పాత కూరగాయల మార్కెట్‌లో రహదారిపైనే కూరగాయల విక్రయాలు జరుగుతున్నాయి. వారసంత సైతం రోడ్డుపైనే జరుగుతుండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.

● మెట్‌పల్లిలో అర్ధంతరంగా నిలిచిన పనులు

మెట్‌పల్లి పట్టణంలోని వెల్లుల్ల రోడ్‌లో గల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్‌కు సమీపంలో రూ.10.50 కోట్ల నిధులతో సమీకృత మార్కెట్ నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో అప్పటి పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా పనులు ప్రారంభించారు. సంబంధిత కాంట్రాక్టర్ మొదట వేగంగానే పనులు చేపట్టాడు. అనంతరం బిల్లులు సక్రమంగా రాకపోవడంతో పనులు నిలిపివేశాడు. దీంతో సమీకృత మార్కెట్ నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయింది. పట్టణంలోని పాత బస్టాండు, మార్కెట్ రోడ్డు, వెల్లుల్ల రోడ్డులో ఇరువైపులా కూరగాయలు, మాంసం విక్రయాలు జరుపుతున్నారు. దీంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. విద్యుత్, మూత్రశాలలు, మంచినీటి వసతి లేకపోవడంతో రైతులు, వ్యాపారులు, వినియోగదారులు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారు.

● కోరుట్ల, ధర్మపురిలో మౌలిక వసతులు కరువు

కోరుట్ల పట్టణంలోని మార్కెట్ యార్డులో రూ.6.50 కోట్ల నిధులతో సమీకృత మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. పట్టణంలోని కల్లూరు రోడ్డులో రూ2 కోట్లతో అదనపు సమీకృత మార్కెట్‌ను సైతం నిర్మించారు. కల్లూరు రోడ్డులో నిర్మించిన సమీకృత...

మిగతా 6లో..

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

● కోరుట్ల మున్సిపల్ కమిషనర్ తిరుపతి


తడి, పొడి చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోరుట్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ తిరుపతి అన్నారు. మంగళవారం పట్టణంలోని వివిధ వార్డులలోని మహిళలు, పలు పాఠశాలలోని విద్యార్థులకు తడి, పొడి చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను విజయవంతం చేసి కోరుట్ల మున్సిపాలిటీని ముందు వరుసలో ఉంచాలన్నారు. ప్లాస్టిక్ వాడితే వచ్చే అనార్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు మహేష్, వార్డు అధికారులు మధులతో పాటు ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'క్రీడలతో మానసిక ఉల్లాసం'


గెలుపొందిన క్రీడాకారులతో అతిథులు

జగిత్యాల అగ్రికల్చర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ (పీజేటీఎస్ఏయూ) డీన్ ఆఫ్ అగ్రికల్చర్ ఝాన్సీరాణి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొలాసలో గల వ్యవసాయ పరిశోధన స్థానంలో బోధనేతర సిబ్బంది కోసం నిర్వహించిన మూడు రోజుల క్రీడలు విజయవంతంగా ముగిసిన సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఝాన్సీరాణి మాట్లాడుతూ ఉద్యోగుల కోసం నిర్వహించిన ఈ పోటీల్లో వయసుకు సంబంధం లేకుండా ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. క్రీడలతో ఉద్యోగంలో ఒత్తిడిలు ఉంటే దూరమై, మానసిక ప్రశాంతత వెల్లివిరుస్తుందన్నారు. క్రీడల కోసం సకల సదుపాయాలు కల్పించడం అభినందనీయమన్నారు. ప్రశాంత వాతావరణంలో క్రీడలు కొనసాగడం సంతోషకరం అన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు అతిథుల చేతుల మీదుగా పతకాలను, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ పరిశోధక సంచాలకులు డాక్టర్ శ్రీలత, డాక్టర్ నరేష్, బోధనేతర సంఘ నాయకులు శ్రీనివాస్ యాదవ్, జయరాం, డాక్టర్ మహేష్‌తో పాటు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

●అదనపు కలెక్టర్ బీఎస్ లత


బోరు పని తీరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లత

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల ప్రత్యేక అధికారి, కోరుట్ల ఆర్‌డీఓ జీవాకర్‌రెడ్డి మండలంలోని పైడిమడుగు గ్రామంలో పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలోని మురికి కాల్వను పరిశీలించారు. పారిశుధ్య సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. చెత్త సేకరణ విధానంపై కార్యదర్శి శేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీలోని రికార్డులను పరిశీలించి వివిధ పనుల వివరాలపై ఆరా తీశారు. గ్రామంలో ఉన్న బోర్ల వివరాలను తెలుసుకొని వాటి పని తీరును స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఏపీఓ కృపాకర్ లతో పాటు గ్రామస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

'రైతుల కష్టాలు పట్టించుకోని ప్రభుత్వం'


రోళ్ళవాగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న మాజీ మంత్రి కొప్పుల, బీఆర్ఎస్ నాయకులు

బీర్‌పూర్,ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కష్టాలు పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవివేక పాలన వల్ల రాష్ట్రంలో పంటలు ఎండుతున్నాయన్నారు. మంగళవారం బీర్‌పూర్ మండలకేంద్రంలోని రోళ్ళవాగు ప్రాజెక్టును బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావ్, మాజీ జెడ్పీ ఛైర్‌పర్సన్ దావ వసంత, లోక బాపురెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్బంగా కొప్పుల మాట్లాడుతూ పంటలు ఎండిపోతున్నాయని గతంలో సంబంధిత శాఖ మంత్రిని కలిసి నీటి విడుదల చేయాలని కోరగా 1టీఎంసీ విడుదలకు హామీ ఇచ్చి ఆఫ్ టీఎంసీ ఇచ్చారన్నారు. రోళ్ళవాగు ప్రాజెక్టుకు షెట్టర్ బిగించి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. తమ ప్రభుత్వంలో 95శాతం పనులు పూర్తి చేశామని కేవలం ఒక్క షెట్టర్ బిగించాల్సి ఉందన్నారు. రోళ్ళవాగు ప్రాజెక్టుకు షెట్టర్ బిగిస్తే బీర్‌పూర్, ధర్మపురి మండలలలోని సుమారు 15 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. గతంలో అటవీశాఖ అనుమతులు ఇవ్వడం కోసం 850 ఎకరాల భూమిని ఆయా మండలాలలో అప్పజెప్పామని కేవలం అనుమతులకోసం 15 నెలలుగా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ, అయ్యోరి రాజేశ్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలే బీఆర్ఎస్‌కు ప్రధానం

జగిత్యాల అగ్రికల్చర్: బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్ర ప్రయోజనాలే ప్రధానమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఎందుకు గెలిపించాలో ఆ పార్టీ నాయకులు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే 2లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి 15 నెలలు గడిచిన ఉద్యోగాలు భర్తీకి చర్యలు చేపట్టలేదన్నారు. కేసీఆర్ హయాంలో నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షరాసిన 30వేల మంది ఉద్యోగులకు అపాయింట్‌మెంట్ లెటర్ పంచి తామే ఉద్యోగాలు ఇచ్చామని ప్రకటించుకోవడం హాస్యాస్పదం అన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ ఛైర్మెన్ లోక బాపురెడ్డి, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంత సురేష్, మాజీ వైస్ ఛైర్మెన్ హరిచరణ్‌రావు తదితరులున్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన


వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్

రాయికల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరిపెల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల సైన్స్ పరికరాలను తయారు చేశారు. వైజ్ఞానిక ప్రదర్శనను జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రదర్శనలను ఆసక్తిగా గమనించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సుష్మా, ఎంఈవో రాఘవులు, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ బొప్పారపు మానస, హెచ్ఎం కడకుంట్ల అభయ్ రాజ్, ఉపాధ్యాయులు బెజ్జంకి హరికృష్ణ, కడకుంట్ల వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో

బీర్‌పూర్,ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి):బీర్‌పూర్ మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్బంగా ఆరోగ్య సమస్యలతో వచ్చిన రోగులను పరీక్షించారు. అనంతరం రికార్డులు పరిశీలించి చర్మవ్యాధుల నివారణ, కుష్టు రోగుల పట్ల శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కిషోర్ పవర్, ఏఎన్ఎంలు కళవతి, లక్ష్మీ, ఆశవర్కర్లు తదితరులు ఉన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

-ట్రాన్స్‌కో ఏడీఈ వరుణ్ కుమార్

పెగడపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవి కాలంలో మరింత మెరుగైన విద్యుత్ సరఫరా కోసం ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు కార్యక్రమం చేపట్టినట్లు ట్రాన్స్‌కో ఏడీఈ వరుణ్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన పెగడపల్లిలో రూ.4లక్షల వ్యయంతో 100, 63 కేవీఏ త్రీఫేజ్ సామర్థ్యం కలిగిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి మంగళవారం ప్రారంభించారు. అనంతరం రైతులకు విద్యుత్ భద్రత, పొదుపు సూచనలు, మోటార్ల వద్ద కెపాసిటర్ బిగింపు గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెగడపల్లి ఏఈ వెంకట్ రెడ్డి, సిబ్బంది వేణుగోపాల్, బిక్షపతి, మునిరాజ్, పరుశరాం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులను పరిశీలించిన డీఆర్డీవో

మల్యాల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దుట్ల, పోతారం గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పశువుల పాక, కందకాల పనులను డీఆర్డీవో రఘువరన్ పరిశీలించారు. మల్యాలలో పుట్టగొడుగుల శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. డీఆర్డీవో వెంట అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్, ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ప్రవీన్, ఏపీవో శ్రీనివాస్, ఈసీ మనోజ్, టెక్నికల్ అసిస్టెంట్లు జలపతిరెడ్డి, లావణ్య ఉన్నారు.

ఘనంగా శివ పార్వతుల కల్యాణం

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని అరవింద్‌నగర్‌లో గల అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళ వారం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు తిగుళ్ల విషు శర్మ నేతృత్వం లోని ఆలయ అర్చక బృందం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పాల్గొని శివపార్వతులను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ బట్టు సుధాకర్, కార్యదర్శి వీరబత్తిని శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్ పాల్గొన్నారు.



శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు



కోటిలింగాలలో విద్యుత్ కాంతులతో మెరిసి పోతున్న ఆలయం

వేములవాడకు ప్రత్యేక బస్సులు

కోరుట్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల ఆర్టీసీ బస్ డిపో నుంచి వేములవాడ పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపనున్నట్లు ఆర్టీసీ డీఎం మనోహర్ మంగళవారం తెలిపారు. కొత్త బస్టాండ్ ఆవరణలో ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేశారు. కోరుట్ల బస్ డిపో నుంచి మూడు రోజుల పాట 62 బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. కోరుట్ల బస్టాండ్ నుండి కథలాపూర్, రుద్రంగి, చందుర్తి మీదుగా బస్ సర్వీసులు నడుస్తాయని పేర్కొన్నారు. కోరుట్ల నుంచి వేములవాడకు పెద్దలకు రూ.120, పిల్లలకు రూ.70 టికెట్ ఉన్నట్లు తెలిపారు.

కుంకుమ పూజలు

పెగడపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సామూహిక కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు గుండి రాజేశ్వరశర్మ, శ్రీనివాస శర్మ, అరుణల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ ఒరుగల శ్రీనివాస్, కమిటీ సభ్యులు రాంచంద్రం, శేఖర్, శ్రీనివాస్, గోపికృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా దుబ్బరాజన్న కల్యాణం

● పట్టు వస్త్రాలు సమర్పించిన కలెక్టర్

4


దుబ్బరాజన్నకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్



రాజన్నా.. వస్తున్నామయ్యా





చలువ పందిళ్ల కింద సేదతీరుతున్న జాతరకు వచ్చిన భక్తులు



కాంతులీనుతున్న వేములవాడ దేవస్థానం

- శివనామస్మరణతో మార్మోగుతున్న వేములవాడ రాజన్న క్షేత్రం
- మహాశివరాత్రి వేడుకలు ప్రారంభం
- భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం

సిరిసిల్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న క్షేత్రంలో మహాశివరాత్రి వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు వేములవాడకు తరలివస్తున్నారు. మూడు రోజుల పాటు సాగే రాజన్న జాతరకు తెలంగాణతోపాటు ఆంధ్రా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులను తీర్చుకోనున్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున అధికారులు, అర్చకులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మహాశివరాత్రి పర్వదినం బుధవారం వేములవాడ రాజన్న సన్నిధిలో జాగరణ చేయడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. నాలుగు లక్షల మంది భక్తులు తరలివస్తా రనే అంచనాతో అధికారులు ఏర్పాట్లు చేశారు.

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో అనుబంధ దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చలువ పందిళ్లు వేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను ఉచితంగా దేవాలయాన్ని చేర్చే విధంగా వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి 14 బస్సులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఏర్పాట్లను నిరంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ పర్య వేక్షిస్తున్నారు. పోలీస్ ఔట్‌పోస్టులు, కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. తాత్కాలిక వైద్యశాల ఏర్పాటు చేశారు.



ఆలయ ఆవరణలో పోలీస్ సిబ్బంది

జిల్లాస్థాయి అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించారు. 1,500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఉచిత భోజనం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. వేములవాడకు వచ్చే అన్ని దారుల్లో భారీ స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. దేవాలయం ప్రాంగణంలో సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శివార్చన పేరిట సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా పారిశుధ్య చర్యలను చేపట్టారు. ఇందుకోసం జోన్‌లను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు.

ప్రత్యేక పూజలు..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాజరాజేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మంగళవారం రాత్రి 7 గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్ శ్రీస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. రాత్రి 7.30 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం వారి ద్వారా పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 9 గంటలకు నిశీ పూజ అనంతరం భక్తులకు స్వామివారి లఘు దర్శనం, కోడె మొక్కులు కొనసాగిస్తారు. బుధవారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా లఘు దర్శనాలు, కోడె మొక్కులు నిరంతరాయంగా కొనసాగుతాయి. బుధవారం తెల్లవారుజామున 1.30 గంటల వరకు స్థానికులకు సర్వదర్శనం, 1.30 నుంచి 2.30 గంటల వరకు దాతలు, స్థానిక అధికారులకు దర్శనం, 3.30 నుంచి 3.40 వరకు ఆలయ శుద్ధి, మంగళ వాయిద్యాలు, 3.40 నుంచి 4.23 వరకు సుప్రభాతం, ఉదయం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు ప్రాతఃకాల పూజ, అర్చకుల దర్శనం, అనంతరం నిరంతరాయంగా దర్శనాల ఉంటాయి. సాయంత్రం 6.08 నుంచి స్వామి వారి కల్యాణ మండపంలో మహా లింగార్చన, రాత్రి 11.30 నిమిషాలకు లింగోద్భవ కాలంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభి షేకం నిర్వహిస్తారు.

రూ.2.03 కోట్లతో ఏర్పాట్లు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేములవాడ రాజన్న క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రూ.2.03 కోట్లతో ఏర్పాట్లు చేశారు. వాహనాల పార్కింగ్, చలువ పందిళ్లు, క్యూలైన్ల క్రమబద్ధీకరణ, రాజన్న జల ప్రసాదం, మజ్జిగ ప్యాకెట్లు, శుద్ధ జల క్యాన్లు, వాటర్ ట్యాంకర్‌లు వంటివి ఏర్పాటు చేశారు. హెల్ప్‌సెంటర్లు, ఆరోగ్య శిబిరాలను సిద్ధం చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ధర్మగుండంలో నీటిని నిరంతరం శుభ్రం చేయడంతోపాటు 137 తాత్కాలిక స్నానపు గదులు, 60 చోట్ల తాత్కాలిక మరుగుదొడ్లు సిద్ధం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వేములవాడకు వచ్చే భక్తుల కోసం హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, హన్మకొండ, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్, నిజామాబాద్, జగిత్యాల మహబూబ్‌నగర్, నర్సంపేట కోరుట్ల, మెట్‌పల్లి ఆర్మూర్, నిర్మల్, మంచిర్యాల ఆదిలాబాద్ తదితర ప్రాంతాల నుంచి ప్రత్యే కంగా 850 బస్సులను నడుపుతున్నారు. భక్తులకు స్వామివారి ప్రసాదం కోసం ఐదు లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. అభిషేకం లడ్డూ 100, సాధారణ లడ్డూ .20, పులిహోర 15 రూపాయల చొప్పున విక్రయిస్తున్నారు. భక్తులు రాజన్న ఆలయంలో కోడె మొక్కులు చెల్లించుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వీఐపీ బ్రేక్ దర్శనానికి 300, కోడె మొక్కుకు 200 రూపాయలు వసూలు చేయనున్నారు. భక్తులకు జాగరణ సమయంలో ప్రత్యేకంగా శివార్చన వేదికగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



తరలి వస్తున్న భక్తులు

అడుగడుగునా పోలీస్ బందోబస్తు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి క్షేత్రంలో నిర్వహించే మహాశివరాత్రికి మంగళవారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. బుధవారం మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి 11 గంటల నుంచి 1.30 గంటల వరకు పురజ నులకు దర్శనం అవకాశం కల్పించారు. 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు దాతలు, అధికారులు, మీడియా ప్రతినిధులకు దర్శనం కల్పించారు. దీంతో భక్తులు పెద్ద సంఖ్యలో రాజన్న దర్శనం కోసం క్యూలైన్ లో బారులు తీరారు.

అడుగడుగునా సోదాలు..

వేములవాడలో నిర్వహించే మహా శివ రాత్రి జాతర సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో 1500మంది పోలీసులు సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. రాజన్న క్షేత్రంలోకి వచ్చే ప్రతి వాహనాన్ని సోదాలు చేస్తూ పట్టణంలోకి అనుమతిస్తున్నారు. 900లకు పైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

రాజన్నను దర్శించుకున్న భక్తులు..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులు ధర్మ గుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్ర దర్శనం, కోడె మొక్కు కూలైన్‌లో భక్తులు ఆలయం లోకి చేరుకుని శ్రీపార్వతిపర మేశ్వరులను దర్శించుకుని తరించారు. రాజన్న దర్శనం కోసం భక్తులు క్యూలైన్‌లో గంటల తరబడి నిరీక్షించారు. రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించి క్యూలైన్‌లు త్వరగా కదిలేలా చర్యలు తీసుకున్నారు.





జాతరకు వేములవాడకు వస్తున్న వృద్ధులు



ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

వైభవంగా దుబ్బరాజన్న కల్యాణం

పట్టు వస్త్రాలు సమర్పించిన కలెక్టర్



శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సారంగాపూర్, ఫిబ్రవరి, 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం దుబ్బరాజన్న క్షేత్రంలో మంగళవారం వేదపండితులు చంద్రశేఖర్ శర్మ నేతృత్వంలో శివ పార్వతుల కల్యాణం అంగరంగా వైభవంగా నిర్వహించారు. కలెక్టర్ సత్యప్రసాద్ స్వామి వార్ల కల్యాణానికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు, వేద పండితులు కలెక్టర్‌కు తీర్థ ప్రసాదాలను అందించి సత్కరించారు. ముందుగా కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల మంత్రోచ్చరణలతో కల్యాణం నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో అనూష, ఆలయ చైర్మన్, పొరండ్ల శంకరయ్య, కొల్మల రమణ, కోండ్ర రాంచందర్‌రెడ్డి, కోల జమున శ్రీనివాస్, ఆకుల రాజిరెడ్డి, తోడేటి శేఖర్‌గౌడ్, బొడ్డుపెల్లి రాజన్న ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

భక్తుల చేయూతతో శివాలయానికి పునర్ వైభవం

రాయికల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని శివాలయం భక్తుల చేయూతతో పునర్ వైభవం పొంది మహా శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. నాలుగు దశాబ్దాల క్రితం చౌవులమద్ది శివలింగం అనే దళిత వ్యక్తి కృషితో నిర్మితమై ఆయన చేతనే పూజలు అందుకుంది. 2024లో శివలింగం శివైక్యం చెందడంతో నిత్య పూజలు ఆగిపోయి శివాలయం ఆదరణ కోల్పోయింది. దీంతో శివ భక్తులైన యువకులు మన శివాయలం పేరిట గత అక్టోబరు నెలలో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేయడంతో పలువురు స్పందించి విరాళాలు అందించారు. వాట్సాప్ గ్రూపులో 689 మంది సభ్యులుగా ఉన్నారు. అందులో ఆలయానికి సంబంధించిన వివరాలు, ఖర్చులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తున్నారు. శివలింగం కుటుంబసభ్యులతో పాటు మన శివాలయం పేరిట అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. వాట్సాప్ గ్రూపులో ఉన్న సభ్యులంతా నెలకు రూ.100 చొప్పున క్యూఆర్ కోడ్‌తో ఉన్న అకౌంట్‌లో వేస్తే ఆలయ అకౌంట్‌లో జమ అవుతున్నాయి. వాటిని ప్రతి నెలా ఆలయ పూజారి వేతనం, నిత్య దీపారాధనకు వెచ్చిస్తున్నారు. దీంతో శివాయంలో మళ్లీ పూజలు ప్రారంభం కావడంతో భక్తుల రాక పెరిగింది.



ఉత్సవాలకు ముస్తాబైన రాయికల్ శివాలయం

కోటి వరాల దేవుడు రాజన్న..

- ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్
- విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి రాజన్నకు పట్టువస్త్రాల సమర్పణ

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కోడెమొక్కు చెల్లించుకుంటే కోటి వరాలు ఇచ్చే దేవుడిగా వేములవాడ రాజన్న ప్రసిద్ధి కెక్కాడని, దేశంలో ఎక్కడా లేని మొక్కు వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఉందని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మహాశివరాత్రి జాతరను పురస్కరించుకుని మంగళవారం రాత్రి శ్రీరాజరాజేశ్వర స్వామివారికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దంపతులతో కలిసి పొన్నం దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన పొన్నంకు ప్రభుత్వ విప్, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. మంగళవాయిద్యాల మధ్య పట్టువస్త్రాలను తీసుకుని ఆలయంలోకి ప్రవేశించారు.

ముందుగా శ్రీలక్ష్మీగణపతి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీరాజరాజేశ్వరస్వామి వారి అభిషేక పూజలో పాల్గొన్నారు. అనంతరం జగజ్జనని శ్రీపార్వతి దేవి అమ్మ వారిని దర్శించుకుని తరించారు. మహా మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పొన్నం మాట్లాడుతూ రాజన్న సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఎనిమిది మంత్రి మంత్రులం ఆలయానికి వచ్చామని, ఆలయాభివృద్ధికి తోటి మంత్రులతో కలిసి కృషి చేస్తున్నామని, రాజన్న ఆలయాభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. అధికారులు సమన్వ యంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారని, రాజన్న ఆలయానికి వచ్చే భక్తులు ఉపవాసంతో ఉంటారని, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరగా దర్శనం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించామ న్నారు. వచ్చే శివరాత్రి వరకు అభివృద్ధి పనులు ముందుకు సాగేలా రాజన్నను వేడుకున్నట్లు తెలిపారు.

లోకకల్యాణం జరగాలని వేడుకున్నాను.. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని, లోకకల్యాణం జరగాలని వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని వేడుకున్నానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. భక్తులకు త్వరగా దర్శనం కలిగేలా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. అంతే కాకుండా రాజన్న ఆలయంలో రూ. 70 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మరింత అభివృద్ధి జరిగే లా మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ముందుకు సాగుతామన్నారు. వెంట ఈవో వినోద్‌రెడ్డి కనికరపు రాకేష్, సంద్రగిరి శ్రీనివాస్, నాగం కుమార్, చిలుక రమేష్ సాగరం వెంకటస్వామి, పొత్తూరి శ్రీనివాస్ ఉన్నారు.

రాజన్నకు టీటీడీ పట్టువస్త్రాలు

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారికి తిరుమల, తిరుపతి దేవస్థానం డిప్యూటీ ఈవో లోకనాథం నుంచి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కాగా ఆలయ అర్చకులు ఆశీర్వచనం గావించగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. అలాగే స్వామివారి ఆలయానికి శృంగేరి పీఠం తరఫున వేదపండితులు రాధకృష్ణశర్మ పట్టువస్త్రాలు సమర్పించారు. తిరుమల, తిరుపతి, శృంగేరి సభ్యులను మంత్రి పొన్నం, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లు ఘనంగా సన్మానించారు.



రాజన్నకు పట్టు వస్త్రాలు తీసుకువెళుతున్న మంత్రి పొన్నం, విప్ ఆది శ్రీనివాస్ దంపతులు, తిరుమల, తిరుపతి దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న డిప్యూటీ ఈవో లోకనాథం, శృంగేరి పీఠం నుంచి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న రాధకృష్ణశర్మ

కన్నుల పండువగా మల్లికార్జునుడి శోభాయాత్ర


ఓదెల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో సోమవారం భ్రమరాంభ మల్లికార్జునస్వామి శోభాయాత్రను కన్నులపండువగా నిర్వహించారు. గ్రామంలోని పలు వీధుల గుండా ఊరేగించి మేళతాళాలతో ఒగ్గుడోలు కళాకారులు, పోతరాజుల నృత్యాలతో స్వామివారిని ఊరేగించారు. మహిళలంతా మంగళహారతులతో ఉత్సవ మూర్తులను దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈవో సదయ్య, అర్చకులు,సిబ్బంది పాల్గొన్నారు.




సూక్ష్మ కళాకారుడి ప్రతిభ

గుండు పిన్నుపై శివయ్య, నందీశ్వరుడు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని తులసీ నగర్‌కు చెందిన ప్రముఖ సూక్ష్మ కళాకారుడు గుర్రం దయాకర్ గుండు పిన్నుపై శివయ్య, నందీశ్వరుడిని తయారు చేశాడు. ఇంతకు ముందు గుండు పిన్నుపై వివిధ కళాఖండాలను రూపొందించిన దయాకర్‌ను పలువురు ప్రశంసించారు.





గుండు పిన్నుపై తయారు చేసిన శివయ్య, నందీశ్వరుడు, కళాకారుడు దయాకర్

చాక్ పీస్‌లతో శివలింగం

ఓదెల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని మడకకు చెందిన సూక్ష్మ కళాకారుడు ఆడేపు రజనీకాంత్ చాక్‌పీస్ లతో 109 శివలింగాలను రూపొందించారు. సుమారు పది గంటల పాటు శ్రమించి సూక్ష్మ కళా నైపుణ్యంతో తీర్చిదిద్దారు. సెంటిమీటర్ ఎత్తు, వెడల్పు, చాక్ పీసులపై స్కాల్పరింగ్ ఆర్ట్ ద్వారా గుండు పిన్నులతో శివలింగాలను రూపొందించినట్లు తెలిపాడు. గతంలో పెన్సిల్ గ్రాఫైట్‌పై శివలింగం, క్యారెట్, బంగాళదుంపలతో కార్వింగ్ కళా నైపుణ్యంతో శివలింగాలను తయారు చేసినట్లు రజనీకాంత్ తెలిపారు. గతంలో కూడా ఇలాంటి ఆకృతులను రూపొందించి, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆర్‌హెచ్‌ఆర్ ప్రపంచ రికార్డులు, ఉత్తమ కళాకారుడిగా అవార్డు అందుకున్నారు.





చాక్‌పీస్‌లతో రూపొందించిన శివలింగం, కళాకారుడు రజనీకాంత్



జ్యోతిప్రజ్వలన చేసి శివార్చన వేదికను ప్రారంభిస్తున్న పొన్నం ప్రభాకర్, ఆది శ్రీనివాస్

శివార్చన వేదికను ప్రారంభించిన మంత్రి, విప్

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయ గుడి చెరువులో ఏర్పాటు చేసిన శివార్చన వేదికను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఈవో వినోద్‌రెడ్డితో కలిసి బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. కళాకారులు ప్రదర్శించిన ఒగ్గు కళాకారుల నృత్యాలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఈవో వినోద్‌రెడ్డి, మామిడి హరికృష్ణ, నాగం కుమార్, కనికరపు రాకేష్, సాగరం వెంకటస్వామి, సంద్రగిరి శ్రీనివాస్, తూం మధు, ఇప్పపూల అజయ్, అన్నారం శ్రీనివాస్, పొత్తూరి శ్రీనివాస్ ఉన్నారు.



కళాకారులతో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కొండగట్టులో భక్తుల రద్దీ



ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయ స్వామి సన్నిధానం మంగలవారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతా ళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహర నాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం, పార్కింగ్ ప్రదేశం నిండిపోయాయి.

పట్టభద్రులు.. మీ ఓటు పదిలంగా వేయండి



చొప్పదండి. ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ సమయం దగ్గర పడుతుంది. ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లకు భిన్నంగా జరిగే ఎమ్మెల్సీ పోలింగ్ బ్యాలెట్ పద్ధతిలో జరుగుతుంది. అనేక మంది కొత్తగా ఓటర్‌గా నమోదు కాగా ఓటు వేయడానికి పలు జాగ్రత్తలు పాటించాలి. ఓటు వినియోగంపై పట్టభద్రుల అవగాహన కోసం..

మీకోసం..

ఓటు ఇలా వేయాలి...

- పోలింగ్ బూత్ బయట మీ ఓటర్ క్రమసంఖ్యను చూసుకోండి.
- బూత్ లోపలికి వెళ్లే ముందు మీ పేరు చూసుకొని సంతకం చేయాలి.
- ఓటు వేయడానికి వెళ్లే సమయంలో ఎన్నికల కమిషన్ సూచించిన ఏదైనా ఐడీ కార్డును వెంట తీసుకుపోవాలి.
- పోలింగ్ కేంద్రాలలో ఇచ్చే పెన్‌ను మాత్రమే వాడాలి.
- పోలింగ్ బూత్‌లో మీకు ఇచ్చిన బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థి పేరు, ఫొటో ఉంటుంది.
- మీరు మొదటి ప్రాధాన్యత ఇచ్చే అభ్యర్థికి ఎదురుగా ఉన్న బాక్స్‌లో ఒకటి అని రాయాలి.
- ఇతర అభ్యర్థులకు కూడా మీరు నచ్చిన ప్రాధాన్యత ఓటు వేసుకోవచ్చు. 1,2,3 ఇలా నంబర్ వేసి ఓటు వేసుకోవచ్చు.

ఓటర్లు చేయకూడని పనులు

- పోలింగ్ బూత్‌లో మీ స్వంత పెన్‌ను వాడవద్దు.
- అభ్యర్థులు అందరికీ ఒకే నంబర్ ఇవ్వవద్దు.
- బ్యాలెట్ పేపర్‌లోని బాక్స్‌లో ఒకటి అని రాయవద్దు. ఇంగ్లీష్‌లో కూడా రాయవద్దు. కేవలం అంకెలు (1,2,3) అని మాత్రమే వేయాలి.
- బ్యాలెట్ పేపర్‌లో ఎక్కువ పేర్లు ఉంటాయి. మీకు నచ్చిన వారికి 1 నంబర్ వేయాలి.
- ఎన్నికల సిబ్బంది చెప్పినట్లుగానే బ్యాలెట్ పేపర్‌ను ఫోల్డ్ చేయాలి. లేని పక్షంలో ఓటు చెల్లదు.
- బ్యాలెట్‌ను ఖాళీగా వేయరాదు. ఇంక్ పెన్నుతో ప్రాధాన్యత నంబర్‌ను రుద్దవద్దు.
- అభ్యర్థి పక్కన సూచించిన బాక్స్ వద్ద కాకుండా ఇతర చోట్ల అంకెలు వేస్తే ఓటు చెల్లదు.
- బ్యాలెట్ పేపర్‌లో (1,2,3) అంకెల ప్రాధాన్యత కాకుండా ఇతర నెంబర్లు వేస్తే ఓటు చెల్లదు.

ఎమ్మెల్సీ ఫలితాలను రెఫరెండంగా భావిస్తారా..

- ఎన్నికల్లో గెలిచేది బీజేపీ అభ్యర్థులే..
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, పక్కన ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, కాటేపల్లి వెంకటరమణారెడ్డి, నాయకులు

కరీంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ 14 నెలల పాలన బాగుందని అంటున్న సీఎం ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను రెఫరెండంగా తీసుకునేందుకు సిద్ధమా అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. మంగళవారం కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. కులగణనకు తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామన్నారు. విద్యుత్ కొనుగోళ్ల అక్రమాలపై జస్టిస్ లోకూర్ కమిషన్ నివేదిక ఇచ్చి మూడు నెలలైనా ఎందుకు బయటపెట్టలేదన్నారు.

ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్ వల్లే ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగమైందని సీఎం హోదాలో రేవంత్‌రెడ్డే చెప్పారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ గడువును పొడగిస్తున్నారే తప్ప కేసీఆర్‌ను ఎందుకు విచారించలేదని ప్రశ్నించారు. దమ్ముంటే సీబీఐ విచారణ కోరాలని, దోషులందరినీ అరెస్టు చేసి బొక్కలో వేస్తామన్నారు. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అంటే రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి కూడా వరి వేయొద్దు వేస్తే నష్ట పోతారని రైతులను హెచ్చరిస్తున్నారన్నారు. పొరుగు రాష్ట్రానికి నీటిని దోచి పెట్టడం వల్లే ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు పడ్డా నీటి కటకట ఎందుకు వచ్చిందన్నారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, ఉపాధ్యాయుల పక్షాన పోరాటం చేసేది బీజేపీ పార్టీ మాత్రమే అన్నారు. బీజేపీని ఆదరించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, కాటేపల్లి వెంకట రమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలరాం చంద్రారెడ్డి, మాజీ మేయర్ సునీల్‌రావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జె సంగప్ప పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి..



మాట్లాడుతున్న మహేష్‌కుమార్‌గౌడ్, పక్కన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

- అడుగడుగునా బీసీలను అణచివేస్తున్న బీజేపీ
- పట్టభద్రుల ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి ఓటేయాలి
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

కరీంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్రమంత్రి స్థాయిలో వ్యవహరించకుండా బండి సంజయ్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. మంగళవారం డీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బండి సంజయ్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. ఫార్ములా ఈ రేసు అవినీతిపై కేటీఆర్‌పై కేసు నమోదై, విచారణ జరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు కూడా ఇవ్వలేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ వాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విదేశాల నుంచి నిందితులను తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న పరిమితి ఆయనకు తెలియదా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేస్తున్న అభివృద్ధి పై చర్చకు సిద్ధమన్నారు.

ఏడాది కాలంలో 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, బీఆర్ఎస్ ప్రభుత్వాలు 10 ఏళ్లలో 50 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలన్నారు. సోషల్ మీడియాను అనైతికంగా అబద్ధపు ప్రచారానికి, వీడియోలను మార్ఫింగ్ చేయడానికి బీజేపీ విచ్చలవిడిగ వాడుతోందని విమర్శించారు. దీనిని ప్రజలు గమనించి అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టభద్రుల సమస్యలు పరిష్కారించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిల పాత్ర ఏంటి? అనేది ఒక సారి ఆలోచన చేసుకోవాలన్నారు. సమగ్ర కుల గణనపై సర్వేపై బీజేపీ తన అభిప్రాయం ఏంటో చెప్పాలన్నారు. ధైర్యం ఉంటే బీసీ రిజర్వేషన్ల బిల్లును తొమ్మిదవ షెడ్యూల్‌లో చేరుస్తామని, ప్రధానిని ఒప్పించి 42 శాతం రిజర్వేషన్లకు తెస్తామని బీజేపీ నేతలు చెప్పా లన్నారు. పట్టభద్రుల ఎన్నికలు రాష్ట్ర స్థితిగతులు రాష్ట్ర అంశాలను అవగాహనతో ఓటు వేసే అంశమని, బీసీలను అణగదొక్కుతున్న బీజేపీకి ఓటేస్తారా...? బీసీలకు సర్వం చేస్తున్న కాంగ్రెస్‌కు ఓటేస్తారా పట్టభద్రులు ఆలోచించాలన్నారు. నిన్న ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో జరిగిన సమావేశాలు విజయవంతం కావడంతో దిమ్మతిరిగి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపును ఎవరూ ఆపలేరన్నారు.

సమావేశంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్ జంగ రాఘవరెడ్డి, నాయకులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, ఎర్ర శ్రీనివాస్, వైద్యుల అంజన్ కుమార్, ఎండీ తాజొద్దీన్, ఆకారపు భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్, ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్, మాజీ కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, ఆకుల ప్రకాశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఏమి చేయగలడో చేసి చూపిస్తా

రాజకీయాలను కలుషితం చేస్తున్న రెండు పార్టీల అభ్యర్థులు

పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసన్న హరికృష్ణ

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు ఎమ్మెల్సీలుగా గెలిచిన వారెవ్వరూ పట్టభద్రులు, ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకోలేదు.. నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఏమి చేయగలడో చేసి చూపిస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. మంగళవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంవత్సర కాలంగా 42 నియోజక వర్గాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నానని తెలిపారు. డబ్బులు ఉంటేనే రాజకీయం చేయవచ్చు భావన అనే పోవాలని, బలహీన వర్గాల బిడ్డ ఎందుకు రాజకీయం చేయవద్దు అనే అంశంతో తాను ముందుకు వచ్చానన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థుల్లో ఒకరు పారిశ్రామిక వేత్త, ఇంకొకరు కార్పొరేట్ విద్యావేత్త అని, వీళ్లు ఎందుకు రాజకీయాలను కలుషితం చేస్తున్నారని ప్రశ్నించారు. వారు ఈ రోజు డబ్బులు పంపిణీ చేస్తున్నారని విమర్శించారు. తాను అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజల ముందుకు వచ్చానన్నారు. తాను గెలవక పోతే డబ్బులు రాజకీయాలను ప్రభావితం చేసినట్లేనని, రాజకీయాల్లో డబ్బు ప్రామాణికం కాదన్నారు. తెలంగాణ రూపురేఖలు మారాలి అంటే తన లాంటి వాళ్ళు గెలవాలన్నారు. ఈ గుండె ఏడు నెలలుగా తిరిగి అలిసి పోయిందని, భవిష్యత్ రాజకీయాల్లో ఈ గుండెను మీరే ముందుకు తీసుకుపోవాలన్నారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా ఇన్ని రోజులు ప్రచారం చేసానని, రేపు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో డబ్బులు లేకుండా విద్యావంతులు సర్పంచ్‌లు కావాలి అంటే తన గెలుపు నుంచి మొదలవ్వాలన్నారు. మహిళా సాధికారత గురించి ఏ పార్టీ చర్చించలేదని, తన పేరులో సగం తన భార్యపేరు ఉందని, తనకు మహిళలంటే గౌరవం ఉందన్నారు.

'జూకంటి'కి కొలకలూరి కవితా పురస్కారం

నేడు హైదరాబాద్‌లో ప్రదానం



సిరిసిల్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కవి జూకంటి జగన్నాథం రచించిన 'ఒక కప్పు ఛాయ్- నాలుగు మేసేజ్‌లు' కవితా సంపుటి కొలకలూరి భగీరథ కవితా పురస్కారానికి ఎంపికయ్యింది. బుధ వారం సాయంత్రం హైదరాబాద్‌లో తెలుగు యూనివర్సిటీలో ఎన్‌టీఆర్ కళాప్రాంగణంలో నిర్వహించ నున్న కార్యక్రమంలో జూకంటి జగన్నాథంకు నిర్వాహకులు పురస్కారం అందించనున్నారు.

తండ్రి హత్య కేసులో కుమారుడికి జీవిత ఖైదు

సుల్తానాబాద్ ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి):తండ్రిని హత్య చేసిన కేసులో కుమారుడికి జీవిత ఖైదుతోపాటు ఐదు వేల రూపాయలు జరిమానా విధిస్తూ పెద్దపల్లి మున్సిఫ్ జడ్జ్ సెషన్ కోర్టులో మంగళవారం తీర్పు ఇచ్చారు. పూసాల గ్రామానికి చెందిన తీగల నర్సయ్య వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతనికి భార్య భూదేవి, కొడుకు రాజేషంతో పాటు మరో కుమారుడు ఉన్నారు. జులాయిగా తిరుగుతూ ఇంటి వద్ద ఉంటున్న కొడుకు రాజేశంను ఐకేపీలో ఆరబోసిన ధాన్యం పనుల్లో సహాయం కోసం రమ్మన్నాడు. ఐకేపీ సెంటర్ వద్ద తండ్రి కొడుకుల మధ్య ఘర్షణ జరగగా ఆవేశంలో కొడుకు రాజేశం తండ్రి నర్సయ్యను నెట్టి వేయగా కింద పడిన తండ్రి తలపై రాయి వేయగా నర్సయ్య అక్కడికక్కడే మరణించాడు. ఈ సంఘటనపై తీగల భూదేవి ఫిర్యాదు మేరకు 8 డిసెంబర్ 2023లో కేసు నమోదైంది. కేసు దర్యాప్తు చేయగా మంగళ వారం పెద్దపల్లి జిల్లా కోర్టులో రాజేశంకు జీవిత కాలం కఠిన కారాగార శిక్ష, ఐదు వేల రూపాయలు జరిమానా విధించారు.

విద్యార్థిని వేధించిన వ్యక్తికి నెల రోజుల జైలు శిక్ష

సుల్తానాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పూసాల గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని వేధింపులకు గురి చేసిన మియాపూర్ గ్రామానికి చెందిన గోషిక కుమార్‌కు నెల రోజుల జైలుశిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా, సెషన్స్ జడ్జి శ్రీనివాస రావు మంగళవారం తీర్పు ఇచ్చారు. వేధింపుల సంఘటనపై 20 నవంబరు 2019న బాధితురాలి తండ్రి సుల్తానాబాద్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెద్దపల్లి ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టులో కేసు విచారణ జరిగింది. నేరం ఋజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలీ మృతి



చంద్రయ్య (ఫైల్)

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన మెకిరాల చంద్రయ్య (71) అనే వ్యవసాయ కూలీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం చంద్రయ్య గ్రామ శివారులోని మామిడితోటలో కూలీగా పని చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం సైకిల్‌పై ఇంటికి భోజనానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో చంద్రయ్య అక్కడి కక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. చంద్రయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మృతదేహంతో ఆందోళన

మాదాపూర్ గ్రామంలో ట్రాక్టర్ యజమాని ఇంటి ఎదుట చంద్రయ్య మృతదేహంతో బంధువులు ఆందోళనకు దిగారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని చంద్రయ్య బంధువులను సముదాయించి అక్కడి నుంచి పంపించి వేశారు. చంద్రయ్య అంత్యక్రియలను నిర్వహించే వరకు పోలీసులు గ్రామంలో పికెటింగ్ నిర్వహించారు.

తండ్రి ఆస్తి కోసం కొడుకు పథకం



హుజూరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

- హుజూరాబాద్ చోరీని 24 గంటల్లో ఛేదించిన పోలీసులు
- కొడుకు, కోడలుతో పాటు మరో ముగ్గురు అరెస్టు, పరారీలో ఒకరు
- 70 తులాల బంగారం, రూ.1.50లక్షలు స్వాధీనం

హుజూరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తండ్రి ఆస్తిని కాజేయాలని కొడుకు, కోడలు పథకం వేశారు. హుజూరాబాద్‌లో సంచలనం సృష్టించిన భారీ దొంగతనం కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. అప్పుల పాలై తండ్రిని డబ్బులు అడిగితే ఇవ్వకపోవడంతో కొడుకు, కోడలు ఆస్తి కోసమే పథకం ప్రకారం దొంగతనం చేసి దొరికిపోయారు. వీరికి సహకరించిన మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఒకరు పరారీలో ఉన్నారు. హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ మంగళవారం చోరీ వివరాలు తెలిపారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని ప్రతాపవాడకు చెందిన ప్రతాప రాఘవరెడ్డి-వినోదలకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. పెద్ద కొడుకు ప్రతాప నాగరాజు-శాలినిలు వ్యాపారం చేసి రూ. కోటి వరకు అప్పుల పాలయ్యారు. అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి ఎక్కువ కావడంతో తండ్రి వద్ద ఉన్న డబ్బులు, బంగారం దోచుకోవాలని నెల రోజుల క్రితం ప్లాన్ వేసుకున్నాడు. ఇందుకు అతని హోటల్‌లో పనిచేసే అమీర్‌ను సాయం కోరగా, అతని బంధువైన హనుమకొండ జిల్లా, స్టేషన్‌ఘణపూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన పాత నేరస్తుడు సమీర్, కరీంనగర్‌కు చెందిన మున్నా, హుస్నాబాద్ మండలం కుందువనిపల్లికు చెందిన కృష్ణలతో సుపారీ మాట్లాడుకున్నారు. పథకం ప్రకారం హోటల్‌లో దొంగతనం గురించి చర్చించుకొని ఆదివారం రాత్రి నాగరాజు, శాలిని, అమీర్‌లు పక్కనే ఉన్న వారి ఇంటిలో ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉన్నారు. అర్ధరాత్రి తర్వాత మరో ముగ్గురు కరెంట్ మోటార్ ఆన్ చేయగా నీళ్ల శబ్దం విన్న రాఘవరెడ్డి భార్య వినోద బయటకు వచ్చింది. సమీర్, మున్నా, కృష్ణలు ఇంట్లోకి చొరబడి, ఆమెను కత్తులతో గాయపరిచి కట్టేశారు. ఈ క్రమంలో రాఘవరెడ్డి, ఆయన కూతురు మానస రూమ్‌లో నుంచి బయటకు రాగానే వారిపై దాడి చేశారు. కత్తులతో బెదిరించి 70తులాల బంగారం, రూ. 5లక్షల నగదును దోచుకొని అక్కడి నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌ను పిలిపించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన అనంతరం కుటుంబ సభ్యులను పలు కోణాల్లో విచారించారు. కొడుకు నాగరాజుపై అనుమానం రావడంతో పోలీసులు తమదైన శైలిలో విచారించగా నేరం ఒప్పుకున్నారన్నారు. దీంతో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని 70తులాల బంగారం, రూ. 1.50లక్షల నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

24గంటల్లో ఛేదించిన పోలీసులు

హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో 24గంటల్లోనే దొంగతనం కేసును సీఐ తిరుమల్‌గౌడ్, ఎస్సై యూనస్, సీసీఎస్ టీమ్ సురేందర్‌పాల్, సాయి, అవినాష్, టెక్‌టీమ్ సిబ్బంది ప్రదీప్, సంతోష్ పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పథకం ప్రకారం నాగరాజు హోటల్‌లో పనిచేసే అమీర్ వేలిముద్రలు దొరకవద్దనే ఉద్దేశ్యంతో ముందస్తుగా హుజూరాబాద్ పట్టణంలోని ఓ మెడికల్ షాపులో వారం రోజుల క్రితం గ్లౌజులు కొనుగోలు చేశాడు. అంతేకాకుండా దొంగతనంలో జరిగిన పెనుగులాటలో ఓ వ్యక్తి బ్రాస్‌లెట్ పడిపోయింది. వాటిని ఆధారంగా తీసుకున్న పోలీసులు మెడికల్ షాపునకు వెళ్లి సీసీ పుటేజీలను తీసుకొని విచారించగా నాగరాజు కొనుగోలు చేయమంటే గ్లౌజులు కొనుగోలు చేశానని అమీర్ చెప్పాడు. అలాగే నాగరాజు సెల్‌ఫోన్ డాటా ఆధారంగా కూపీ లాగడంతో దొంగతనం కేసు బయటపడింది. చాకచక్యంగా కేసును ఛేదించిన పోలీసులను ఏసీపీ శ్రీనివాస్‌జీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరాటం

టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలుగా ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడానని, తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే శాసన మండలిలో ఉపాధ్యాయుల గొంతుకనై ప్రశ్నిస్తానని కరీంనగర్, నిజామా బాద్, మెదక్, ఆదిలాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి వై.అశోక్‌కుమార్ తెలిపారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీతో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీగా గెలిపిస్తే సీపీఎస్ రద్దుకు కృషి చేస్తానని, కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేసేలా ప్రభుత్వంతో పోరాడుతానని హామీ ఇచ్చారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 ద్వారా వేతనాల చెల్లింపు, హెల్త్ కార్డుల జారీ, రెసిడెన్షియల్ వసతి గృహ భవనాల నిర్మాణాలు, తదితర సమస్యల పరిష్కారంలో ముందుంటానని హామీ ఇచ్చారు. టిపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నబోయిన తిరుపతి, బిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము రమేష్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కాంపెల్లి లక్ష్మన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల కోసం నిరంతరం పోరాడే వ్యక్తి అశోక్‌కుమార్ గెలుపునకు సంఘాలకు అతీతంగా ఉపాధ్యాయులు ఓటేయాలని కోరారు. సమావేశంలో పోచయ్య, పర్శరాములు గౌడ్, జీవన్ రాజు, కోల రాజమల్లు, డానియల్, దేవదానం, హెచ్‌ఎం నేదునూరి కనకయ్య పాల్గొన్నారు.

టీచర్స్ ఎమ్మెల్సీగా అశోక్‌కుమార్‌ను గెలిపించండి

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్

కరీంనగర్ టౌన్: కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ టీచర్ ఎమ్మెల్సీగా ఉద్యమ నేత అయిన వై.అశోక్‌కుమార్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలతో ఆయన సమావేశయ్యారు. 36 ఏళ్లకుపైగా ఉపాధ్యాయ ఉద్యమ అనుభవం కలిగిన తెలంగాణ ఉపాధ్యాయ ఉద్యోగుల జేఏసీ నాయకుడిగా అశోక్ కుమార్ పనిచేశారని, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషిచేశారని అన్నారు. ఆయనను టీచర్ ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. సమావేశంలో టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి వై అశోక్‌కుమార్, టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తిరుపతి, కె రమేశ్, అశోక్‌కుమార్‌పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. రామడుగు మండలం వెదిర గ్రామానికి చెందిన తేజస్విని(35)కి జగిత్యాల పట్టణంలోని చింతకుంట వాడకు చెందిన బాలె సాయిరాజ్‌తో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే తేజస్విని కడుపు నొప్పి బాధ భరించలేక గత జనవరి 31న జగిత్యాలలోని తన నివాసంలో గడ్డి మందు సేవించింది. కుటుంబ సభ్యులు అదే రోజు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. 26 రోజుల అనంతరం చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నింపింది. మృతురాలి తండ్రి కాంతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్సై మన్మథ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఓటింగ్ కేంద్రంలో తనిఖీలు

వెల్గటూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు వెల్గటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎమ్మెల్సీ ఓటింగ్ కేంద్రంలో మంగళవారం స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు స్క్వాడ్ బృంద సభ్యులు తెలిపారు.

ఘనంగా గిరి ప్రదక్షిణ

మల్లాపూర్, ఫిబ్రవరి, 25 (ఆంధ్రజ్యోతి): శివ భక్తులు మంగళవారం మల్లాపూర్ సోమేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ చేశారు. ముందుగా గ్రామములో సోమేశ్వరస్వామి పల్లకి సేవ నిర్వహించారు. ఉత్సమూర్తులు గల పల్లకి సేవలో భక్తులు పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్‌పై అవగాహన ఉండాలి

జగిత్యాల అగ్రికల్చర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): స్టాక్ మార్కెట్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సెబీ విషయ నిపుణులు పద్మావతి సెల్వన్ అన్నారు. పట్టణంలోని స్థానిక ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సెబీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరిగెల అశోక్, కామర్స్ విభాగాధిపతి గోవర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు


బర్తీపూర్‌లో ముస్తాబైన శివాలయం


సంగెం గ్రామంలో ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

వెల్గటూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. కోటిలింగాల శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయానికి ఆకర్షణీయంగా రంగు రంగుల విద్యుత్ దీపాలు అలంకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కాంతారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. ముత్తునూర్‌లోని ముక్తేశ్వర స్వామి ఆలయం, వెంకటాపూర్ స్వయంభుః కట్ట రాజేశ్వర స్వామి ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

●భక్తులకు అన్ని వసతులు కల్పించాలని దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ ఆదేశించారు. మంగళవారం ఆమె కోటిలింగాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కాంతారెడ్డి పాల్గొన్నారు.

●**కోరుట్ల:** పట్టణంలోని పలు దేవాలయాలు మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి. పట్టణంలోని కోటి నవదుర్గ ఆలయం, నగేశ్వర, మహదేవస్వామి దేవాలయాలతో పాటు పలు ఆలయాల్లో మహా శివరాత్రి ఉత్సవాలను నిర్వహించడానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. మహదేవస్వామి, కోటి నవదుర్గ ఆలయాల్లో నిర్వాహకులు ప్రత్యేక భజనలు, జాగరణ కార్యక్రమాలను నిర్వహించడానికి ఏర్పాట్లను చేస్తున్నారు. పట్టణంలోని వేములవాడ ముఖద్వారం నిర్మాణం చేసిన మహానంది విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించే విధంగా ఏర్పాట్లను చేశారు.

●**కోరుట్లరూరల్:** మండలంలోని ఆయా గ్రామాల్లో గల శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. మండలంలోని సంగెం గ్రామంలోని సంగమేశ్వర ఆలయం, యూసుఫ్ నగర్, కల్లూర్, మాదాపూర్‌లలోని శివాలయాలతో పాటు పలు గ్రామాల్లోని దేవాలయాలు మహా శివరాత్రి మహోత్సవానికి ముస్తాబయ్యాయి.

●**ఇబ్రహీంపట్నం:** మండలంలోని బర్తీపూర్ గ్రామ శివారులోని బోలేనాథ్ కర్నాల దేవస్థానం మహాశివరాత్రికి ముస్తాబైంది. శివరాత్రి సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు సొంతి మోహన్‌యోగి ఎస్‌ఎంవై ఫౌండేషన్‌ను ప్రారంభించినట్లు తెలిపారు.

●**కొడిమ్యాల:** మండలంలోని నాచుపల్లి, తిప్పయ్యపల్లి, చెప్యాల, హిమ్మతురావుపేట, నమిలికొండ గ్రామాల్లోని శివాలయాలు మహా శివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. నాచుపల్లి, నమిలికొండలో 26న శివ కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. 27న చెప్యాలలో శివ కల్యాణం నిర్వహించనున్నట్లు చెప్యాల గ్రామస్థులు తెలిపారు.

●**మేడిపల్లి:** మేడిపల్లి మండలంలోని తొంబరావుపేట గ్రామంలోని శివాలయంలో శివరాత్రికి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మార్కెట్‌లో శివరాత్రి సందడి


జగిత్యాలలో సామాగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం మార్కెట్‌లో భక్తుల సందడి నెలకొంది. మంగళవారం సాయంత్రం శివరాత్రి పర్వదినానికి కావాల్సిన వస్తువులను కొనుగోలు చేశారు. వివిధ గ్రామాల నుంచి వివిధ గ్రామాల నుంచి గోగు పువ్వు, జీడి పండ్లు, మారేడు కాయలు, నువ్వు కాయలు, బూరు తీయని మక్క కంకులు, జాగారానికి దేవుని ముందు పెట్టే దీపాల కోసం దీపపు చిప్పలు తదితర వస్తువులను మహిళలు కొనుగోలు చేశారు. మంగళవారం సాయంత్రం టవర్ సర్కిల్ ప్రాంతంతో పాటు కొత్త బస్టాండ్ వెళ్లే దారిలో వందలాది మంది అమ్మకందారులు దుకాణాలు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు వచ్చి వస్తువులు కొనుగోలు చేశారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి వార్షికోత్సవం

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి వార్సికోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మెట్‌పల్లి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షికోత్సవాలలో భాగంగా ఆలయంలో హోమయాగం, ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. బుధవారం ఆలయంలో కళ్యాణం నిర్వహించనున్నట్లు నిర్వహకులు తెలిపారు. కళ్యాణంలో 30 జంటలు పాల్గొని ప్రత్యేక పూజలలో పాల్గొననున్నాట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దురిశెట్టి నాటరాజ్, గిరిధర్, మహేష్, ప్రవీణ్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

సమీకృత మార్కెట్ల నిర్మాణాలకు మోక్షమెప్పుడో?

(3వ పేజీ తరువాయి)

మార్కెట్ ఉప యోగంలోకి వచ్చింది. కాగా మార్కెట్ యార్డులో నిర్మించిన సమీకృత మార్కెట్‌లో మౌలిక వసతులు లేకపో వడం, ఇతర సమస్యల కారణంగా వినియోగంలోకి రాలేదు. రూ.కోట్లు వెచ్చించి నిర్మించినప్పటికీ ఉత్సవ విగ్రహంలా సమీకృత మార్కెట్ మారింది. ప్రస్తుతం పట్టణంలోని వేములవాడ రోడ్డు వైపున కూరగాయల క్రయ విక్రయాలు, మాంసం విక్రయాలు, అంగడి కొన సాగుతోంది. ధర్మపురి పట్టణంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.5 కోట్ల నిధులతో సమీకృత మార్కెట్ నిర్మాణం చేపట్టారు. అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా మార్కెట్‌ను ప్రారంభం చేశారు. అయి తే సమీకృత మార్కెట్ వినియోగం అంతంత మాత్రంగానే ఉంది. పలు సదుపాయాలు లేకపోవడం తో అటు సమీకృత మార్కెట్‌లోనూ ఇటు ఇతర ప్రాంతాల్లోనూ కూరగాయలు, మాంసం క్రయ విక్రయాలు జరుగుతున్నాయి.

'కాంగ్రెస్‌తోనే నిరుద్యోగులకు భరోసా'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ నియామకాలతో భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో భాగంగా మల్యాలలో విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లోనే 55వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు ముత్యం శంకర్, ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, తిరుపతి, లక్ష్మారెడ్డి, లక్ష్మన్, సతీష్‌రెడ్డి, లక్ష్మనాచారి, వినయ్, ఇమామ్, ప్రకాష్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, హరినాథ్, విజయ్, వెంకన్న, రమణ, జలంధర్ ఉన్నారు

'కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి'

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి బండ శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, జున్ను రాజేందర్, గాజుల రాజేందర్, శీలం సురేందర్ పాల్గొన్నారు.

●కథలాపూర్: మండలంలోని పోతారం, పోసానిపేట గ్రామాల్లో కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా మంగళవారం పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య ప్రచారం నిర్వహించారు. నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఎంజీ రెడ్డి, మట్టగజపు నర్సయ్య తదితరులు ఉన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ మంగళవారం వార్సికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజ్ ప్రిన్సి పాల్, సిబ్బంది సామూహిక దీపజ్యోతి వెలిగించి, వందేమాతరం గీతాలాపనతో ప్రారంభించారు. విద్యార్థులు పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అటపాలతో పాటు విద్యార్థుల నృత్యాలు అకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యలను చేరుకోవాలన్నారు.

●మల్యాల: మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఫేర్‌వెల్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మోతే శివరామకృష్ణ మాట్లాడుతూ శ్రద్దతో చదివి ఉన్నతంగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీవాణి, అత్తినేని శ్రీనివాస్, సంధ్య, నవాబు, శ్రీనివాస్, రచన, శ్రీకాంత్ పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

ఈజీఎస్ కూలీల హాజరు నమోదు సక్రమంగా నిర్వహించాలి

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కూలీల హజరు నమోదు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ రామకృష్ణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. మంగళవారం మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఎంపీడీఓ రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హజరు శాతంను పరిశీలించి కూలీల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని నర్సరీ, పకృతి వనం, మంచి నీటి బావిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేందర్‌లు పాల్గొన్నారు.


కూలీల హాజరు శాతం పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

సోమేశ్వరస్వామి జాతర ఏర్పాట్ల పరిశీలన

మల్లాపూర్, ఫిబ్రవరి, 25 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ శివారున జరుగనున్న సోమేశ్వరస్వామి జాతర ఏర్పాట్లను మంగళవారం ఎస్పీ పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. అనంతరం మల్లాపూర్ జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రమును పరిశీలించారు.

ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఐఎంఏ జగిత్యాల పట్టణశాఖ అధ్యక్షుడు గూడూరి హేమంత్, ప్రధానకార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్ల జిల్లాపరిషత్ పాఠశాలలో ఐఎంఏ పట్టణశాఖ ఆధ్వర్యంలో బాలికలకు అనీమియా వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యురాలు శ్రీలత, నాగరత్న, పిల్లలవైద్యనిపుణుడు శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ ఫేర్

రాయికల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూటపెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సైన్స్ ఫేర్ నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ వనిత, ప్రధానోపాధ్యాయుడు బొల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతరకు పకడ్బందీ భద్రత

సారంగాపూర్, ఫిబ్రవరి, 25 (ఆంధ్రజ్యోతి) శ్రీ పెంబట్ల కోనాపూర్ జాతర బ్రహోత్సవాలకు సీసీ కెమెరాల పర్యవేక్షణలో భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం జాతర ఏర్పాట్లను జగిత్యాల రూరల్ సీఐ కృష్ణరెడ్డి, ఎస్సై దత్తాద్రితో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జాతర మొత్తం 60 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షన చేస్తున్నట్లు తెలిపారు. డీఎస్పీతో పాటు, 4గురు సీఐలు, 10 ఎస్సైలు, మొత్తం 200 మంది పోలీసులతో బారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. 6 చోట్ల పార్కింగ్ పాయింట్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

దుబ్బరాజన్నను దర్శించుకున్న నాయకులు

సారంగాపూర్, ఫిబ్రవరి, 25 (ఆంధ్రజ్యోతి) పెంబట్ల కోనాపూర్, శ్రీ దుబ్బరాజన్న స్వామిని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డిలు మంగళవారం దర్శించుకున్నారు. అడిషనల్ డీఆర్‌డీవో మదన్‌మోహన్, ఏపీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో సలీం, ఏపీవో శ్రీలత, పంచాయితీ కార్యదర్శులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థులకు పతకాలు

కొడిమ్యాల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కొడిమ్యాల ఆదర్శ పాఠశాల విద్యార్థులు రంగోత్సవ్ సంస్థ నిర్వహించిన జాతీయ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు నాలుగు బంగారు, పది వెండి, మూడు కంచు పతకాలతో పాటుగా పలు ప్రోత్సాహక బహుమతులను పొందినట్లు ప్రిన్సిపాల్ బి. లావణ్య మంగళవారం తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంగ్లీష్ హైండ్ రైటింగ్, కలరింగ్, కార్టూన్, గ్రీటింగ్ కార్డు తయారీ, కేరికేచర్ తదితర పోటీలలో పాల్గొని ప్రతిభ చూపినట్లు తెలిపారు. బహుమతులను గెలుచుకున్న విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ. రాజేశం, ఐ. సత్యానందం, వై. అలేఖ్య, గైడ్ టీచర్ జీ.వి. రమణ, పలువురు ఉపాధ్యాయులు ప్రణీత, విజయ్‌కుమార్, మల్లేశం, శ్రీధర్, పద్మప్రియ, రోహిణి ఉన్నారు.

కార్మిక నాయకుడికి ఘన నివాళి

కోరుట్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : కార్మిక నాయకుడు కడకుంట్ల గంగారాంకు సీపీఐ నాయకులు ఘన నివాళి అర్పించారు. మంగళవారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో గంగారాం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లను అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చెన్న విశ్వనాథం, మౌలానా పాల్గొన్నారు.

'భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలి'


కోటిలింగాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న విప్ అడ్లూరి

వెల్గటూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి సందర్భంగా కోటి లింగాలకు శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు బట్టలు మార్చుకునే గదులను, మరుగుదొడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఇబ్బంది కలుగకుండా ఇచ్చిన హామీ మేరకు కేవలం 24 రోజుల వ్యవధిలో మెఘా కంపెనీ సహకారంతో మహిళలు బట్టలు మార్చుకునే గదులు నిర్మించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం కంపెనీ డైరెక్టర్‌ను కలిసి సీఎస్‌ఆర్ నిధుల ద్వారా ఈ ప్రాంతం లోని ధర్మపురి శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, కోటిలింగాల శ్రీ కోటేశ్వర స్వామి ఆలయం అభివృద్ధికి కృషి చేయాలని కోరనున్నట్లు తెలిపారు. గత ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వాహనాలపై వచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉమా సాగర్‌లను ఆదేశించారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు ప్రమాదం జరుగకుండా గజ ఈతగాళ్లను అందు బాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలలో ఆలయ ఈవో కాంతారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆస్తి పన్ను సకాలంలో చెల్లించాలి'

ధర్మపురి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణ ప్రజలు ఆస్తి పన్నులు, ఇతర పన్నులు సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమీషనర్ కందుకూరి శ్రీనివాస్ కోరారు. ధర్మపురి పట్టణంలోని పలు వార్డుల్లో ఆస్తి పన్ను వసూలు చేస్తున్న వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లతో కలిసి ఆస్తి పన్ను వసూళ్లను మంగళవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో ఆస్తి యజమానికి సంబంధించి పేరులో ఏమైనా చిన్న చిన్న సవరణలకు ప్రత్యేక రెవెన్యూ కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మార్చి మొదటి వారం లోపుగా పూర్తి స్థాయి ఆస్తి పన్ను వసూలు చేయుట కోసం చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట ధర్మపురి మున్సిపల్ మేనేజర్, రెవెన్యూ ఆఫీసర్ బాలె గంగాధర్, రెవెన్యూ అధికారి గోవింద్ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాల పరిశీలన


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో రాము

రాయికల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు, ప్రాథమిక పాఠశాల తదితర పదవ తరగతి పరీక్షా కేంద్రాలను జగిత్యాల జిల్లా విద్యాధికారి కె.రాము మంగళవారం పరిశీలించారు. ఆయా కేంద్రాల్లోని వసతులు, తరగతి గదులను చూశారు. సీసీ కెమెరాల అమరిక, విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి, విద్యార్థులు కూర్చునేందుకు వీలుగా బెంచీలు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. పరీక్షలు రాసే విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు ములస్తం గంగాధర్, ఉపాధ్యాయులు రాజశేఖర్, అయిత పద్మ, చెరుకు మహేశ్వర శర్మ, గుండేటి తరంగిణి, ఏనుగు రజిత, ప్రశాంత్, రమేష్, అర్షియా ఫర్హీన్, జి.రమేష్, నర్సయ్య, రాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సమస్యలు పరిష్కారం

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే సమస్యలు పరిష్కారం అవుతాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణరావు అన్నారు. మంగళవారం మెట్‌పల్లి బార్ కౌన్సిల్‌లో న్యాయవాదులను కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మెట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల లింబాద్రి, న్యాయవాదులు పాల్గొన్నారు.

●పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని టిపిసిసి డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు కోరారు. మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

●కోరుట్ల: పట్టబద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నరేందర్ రెడ్డిని గెలిపించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు కోరారు. మంగళవారం పట్టణంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావుతో కలిసి జువ్వాడి నర్సింగ రావు నిర్వహించారు.

సింగిల్‌విండోను సందర్శించిన నాబార్డు అధికారులు

కొడిమ్యాల, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్ సింగిల్ విండో కార్యాలయాన్ని ముంబాయికి నాబార్డు అధికారి మేనేజర్ హరిహరన్, జగిత్యాల డీడీఎం దిలీప్‌చంద్రతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో పూడూర్ సింగిల్ విండో చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సావనపెల్లి రమేష్, సంఘం డైరెక్టర్లు, డీసీసీబీ ఏజీఎం మహేష్ ఉన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

ఎండపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజారాంపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గాజుల మల్లేశం సోదరుడు గాజుల రామస్వామికి గుండెకు శస్త్ర చికిత్స జరగగా మంగళవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్త

కొడిమ్యాల, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్ గ్రామ రైతుల పంట పొలాలను మంగళవారం కరీంనగర్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త, కో ఆర్డీనేటర్ డాక్టర్ కె. మదన్ మోహన్‌రెడ్డి పరిశీలించారు. సందర్శనలో ఏఈవో రాజేష్, అభ్యుదయ రైతులు రాంరెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.